ఉచిత వైద్యశిబిరం

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం, అలియాబాద్ గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు మహిళలకు సంబంధించిన పరీక్షలు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 125 మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి, 40 మందిని ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందన్నారు. డాక్టర్‌లు వినయ్, షాకీర్, సుచరిత, నిఖిత మార్కెట్ ఇన్‌చార్జి కుమార స్వామి, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్ష తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



శామీర్‌పేట్: శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ ద్రాక్ష పరిశోధన రాజేంద్రనగర్‌కు చెందిన శాస్త్రవేత్తలు మేడ్చల్ జిల్లాలో బుధవారం పర్యటించారు. కీసర మండలంలోని తిమ్మాయిపల్లి, మూడుచింతలపల్లి మండలకేంద్రంలోని ద్రాక్ష తోటలను వారు పరిశీలించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న ఫెంగల్ తుఫాన్ ప్రభావం వల్ల వాతావరణ మార్పుతో ద్రాక్ష తోటలకు తెగుళ్ల ఉధృతి పెరిగే అవకాశం ఉందని, అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ద్రాక్ష పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, జోనల్ హెడ్ డా. సురేష్ కుమార్, శాస్త్రవేత్తలు వెంకటరమేష్, ప్రభావతి, ఉద్యాన అధికారులు స్వప్న, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు



నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సుదర్శన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని బుధవారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మహిపాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, విక్రంరెడ్డి, విక్రాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి దీక్షలో కూర్చొగా.. మాజీ ఎంపీపీలు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, బీజేపీ నాయకుడు కె. లక్ష్మారెడ్డి, జేఏసీ కన్వీనర్ ఎం. లక్ష్మారెడ్డి సాంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నర్సింగ్‌రావు, వెంకట్‌రెడ్డి, నాయకులు ప్రమోద్‌గుప్త, కమలాకర్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

గొర్రెలకు టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, వైద్యులు

మేడ్చల్‌రూరల్: గొర్రెల పెంపకదారులు తమ గొర్రెలకు టీకాలు వేయించాలని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్ తెలిపారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి గోసాయిగూడలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ గొర్రెకు నివారణ టీకా వేయించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, పశు వైద్యాధికారి కురుమూర్తి, నాయకులు శశిధర్‌రెడ్డి, యూసఫ్, సాయికిరణ్, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు గణేష్‌నగర్ కాలనీలో సుమారు 9.2 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ లక్ష్మీవేణుగోపాల్ తదితరుల పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



జవహర్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం జవహర్‌నగర్ పీఎస్ వికలాంగుల కాలనీలో బుధవారం లభ్యమైంది. సబ్ ఇన్‌స్పెక్టర్ రామునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జవహర్‌నగర్ వికలాంగుల కాలనీలో ఓ వ్యక్తి మృతదేహం ఉందన్న స్థానికులు సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు 30–35 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. మైదానంలో నిద్ర పోగా గుర్తు తెలియని వాహనం అతడి తలపై వెళ్లి ఉండొచ్చని, భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వ్యక్తి సమాచారం తెలిస్తే పీఎస్‌లో సమాచారం అందజేయాలన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలు



దమ్మాయిగూడలోని చెరువు సమీపంలో క్లీన్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ తదితరులు



మేడ్చల్‌లో.. చెట్లను తొలగిస్తున్న ప్రజా ప్రతినిధులు

కీసర: ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని రోజ్‌గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో మున్సిపల్ సిబ్బందికి, స్నేహ సంఘాల మహిళలకు కల్చరల్ ప్రోగాం నిర్వహించారు. స్నేహ సంఘాల మహిళలకు రూ. 1,96,50,000 వేలకు సంబంధించి డ్వాక్రా రుణాల చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు చెరువు సమీపంలో, పబ్లిక్ టాయిలెట్స్ సమీపంలో, క్లీన్ చేసే పనుల్లో, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణిలు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..
ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలు పట్టణంలోని 14వ వార్డులో బుధవారం నిర్వహించారు. కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో కాలనీవాసులతో, అధికారులుతో కలిసి చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి సీ–బ్లాక్‌లో పిచ్చి మొక్కలను శుభ్రం చేశారు.

నేడు నేల సంరక్షణపై అవగాహన

సాక్షి,సిటీబ్యూరో: ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని రైతు వేదికలలో మృత్తిక (నేల) సంరక్షణపై గురువారం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ తెలిపారు. మానవాళికి ఆహారం అందించే నేలని సంరక్షించుకున్నట్లయితేనే భావితరాలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తుల్ని అందించే వ్యవసాయాన్ని పండుగ చేయగలమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను ప్రతి రైతు వేదికలో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో జిల్లాకు చెందిన రైతు సోదరులు, ప్రజాప్రతినిధులను, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొంటారన్నారు. వ్యవసాయ అధికారులతోసహా కృషి విజ్ఞాన కేంద్రం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కూడా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారులు మట్టి నమూనాలు సేకరించే పద్ధతితో సహా నేల ఆరోగ్య సూచికను ఎలా అర్థం చేసుకోవాలో రైతులకు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని మృత్తిక (నేల) సంరక్షణపై అవగాహన పొందాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలలోని గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులు స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. యువత స్వయం శక్తితో వ్యాపార, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు యూనియన్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ జూట్ బ్యాగ్ తయారీ ప్రోగ్రాంలో ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఉచిత శిక్షణ ఈ నెల 6 నుంచి 13రోజుల పాటు కొనసాగనుంది. ఈ ఉచిత శిక్షణకు 19 నుంచి 45 సంవత్సరాల వరకు ఉన్న వారు అర్హులని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డులతో పాటు 3 ఫొటోలు వెంట తీసుకువెళ్లాల్సి ఉంటుంది. శిక్షణ పొందే అభ్యర్థులకు ఉచిత భోజనము, వసతి కల్పిస్తారు. సందేహాలుంటే 9391487797, 9177141712, 9618534720, 6301890681, 9441728468 ఫోన్ నంబర్లలో సంప్రదించగలరని స్వర్ణ భారత్ ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది.

సీఎంకు వినతి పత్రం అందజేత



సీఎంను కలిసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోగుల సరితావెంకటేష్ తదితరులు

కీసర: సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్ గోగుల సరితావెంకటేష్ ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న మురుగునీటి కాలువ నిర్మాణ పనులను చేపట్టేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు గోగుల సరితావెంకటేష్ తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం ఎన్నికలు ప్రారంభం



ఘట్‌కేసర్: దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం ఎన్నికలు బుధవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. చెర్లపల్లి నుంచి ఆలేరు పరిధిలోని ఓటర్లకు ఘట్‌కేసర్ రైల్వే ఇంజనీర్ కార్యాలయం సమీపంలో పోలీంగ్ కేంద్రం ఏర్పాటు చేయగా మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. యూనియన్ల వారిగా నాయకులు ఓటర్లకు ఓటర్ స్లిప్పులను అందజేశారు. ఘట్‌కేసర్ పోలింగ్ కేంద్రం పరిధిలో మొత్తం 910 ఓటర్లు ఉండగా.. మొదటి రోజు 211 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యూనియన్ నాయకులు కైలేశ్‌యాదవ్, శివ, శ్రీనివాస్, రాము తదితరులు ఎన్నికల పనితీరును పరిశీలించారు.

ఘనంగా మహారుద్ర హోమం



కీసర: రాష్ట్ర దేవాదయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ప్రజాపాలన ఉత్సవాల సందర్భంగా బుధవారం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం నందు మహా రుద్రహోమం, గణపతి హోమం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని పూలతో సుందరంగ అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

బోడుప్పల్: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం నాల్గోరోజు 8,9 డివిజన్లలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేయకుండా స్వచ్ఛ ఆటోలకే అందించాలన్నారు. రోడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని, అందుకు కాలనీ వాసులు సహకరించాలని కోరారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే వారికి జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్పొరేటర్లు లావణ్యశేఖర్‌రెడ్డి, సీసా వెంకటేష్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామలింగం

రైతులు పాల్గొనాలి

శామీర్‌పేట్: నేడు (గురువారం) సాయిల్ హెల్త్ డే సందర్భంగా మూడుచింతలపల్లి రైతు వేదిక వద్ద కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. మూడుచింతలపల్లి మండలంలోని గ్రామాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 4వ వార్డు మారుతీనగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని మారుతీనగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం వినతి అందజేశారు. కాలనీలో వీధి కుక్కలు, పార్కులో పిచ్చి మొక్కలు తొలగించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులు సమయానికి రాకపోవడంతో శుభ్రత లోపించిందని, వీధి లైట్ల చుట్టూ చెట్లు పెరగడంతో చీకటిమయంగా మారిందన్నారు. డ్రైనేజీ, నీటి లీకేజీలతో రోడ్లపై నీరు పారుతుందని లేఖలో తెలిపారు. అధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా రాము



శామీర్‌పేట్: మేడ్చల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా శామీర్‌పేట మండలం, అలియాబాద్ గ్రామానికి చెందిన తంటం రాము విజయం సాధించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, అర్హులైన లబ్ధిదారులకు చేర్చేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దల ఆదేశాలు, యూత్ కాంగ్రెస్ నాయకుల సూచనలతో పార్టీ మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణతో ముందుకు సాగుతానన్నారు.

మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నాగరాజు గౌడ్



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జనగాం నాగరాజు గౌడ్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన ఎన్నికల్లో మండలంలోని ఎల్లంపేట్ గ్రామానికి చెందిన నాగరాజు గౌడ్ 400 ఓట్ల మెజార్టీతో అధ్యక్షులుగా ఎన్నికయ్యారని పార్టీ ప్రకటించింది.

ఆర్టీసీ ఉద్యోగుల సహపంక్తి భోజనాలు



కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబసభ్యులు

బోడుప్పల్: ఆర్టీసీ ఉద్యోగులంతా చెంగిచర్ల డిపోలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసుకుని, ఆటపాటలతో వేడుకలు నిర్వహించారు. ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాల మేరకు వంటకాలు తయారు చేయించి ఉద్యోగులతో కలిసి డిపో మేనేజర్ కవిత బుధవారం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగుల సమిష్టి సహకారం, సమన్వయం, అంకిత భావంతో ఆర్టీసీ సంస్థ ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. మరింత పట్టుదల, సమన్వయంతో పనిచేస్తేనే సంస్థ మనుగడ సాధిస్తుందన్నారు. ఉద్యోగుల ఆటలపాటల మధ్య వారి పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆరు పడకల ఆసుపత్రి ప్రారంభం



శామీర్‌పేట్: అంకితభావంతో వైద్యులు రోగులకు సేవలందించాలని మేడ్చల్ డీఎంహెచ్‌ఓ రఘునాథస్వామి అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలం, తుర్కపల్లి గ్రామంలో మంజూరైన 6 పడకల ప్రభుత్వ ఆసుపత్రి (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, టీపీసీసీ సభ్యుడు నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజలకు వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో శామీర్‌పేట మండలం, తుర్కపల్లి గ్రామానికి 6 పడకల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మంజూరు చేశామని వివరించారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధిలో వెనకబడ్డాయని, ఇందిరమ్మ రాజ్యంలో ముందుగా పల్లెలను అభివృద్ధి చేసేందుకే సీఎం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తుర్కపల్లి గ్రామానికి ఆసుపత్రిని మంజూరు చేసిన సీఎంకు గ్రామ మాజీ సర్పంచ్ కవితావేణుగోపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, తూంకుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, ఎంసీ పల్లి మండల వైస్‌ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు కృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసానికి తరలి వెళ్లిన గ్రూపు-4 అభ్యర్థులు



సాక్షి,సిటీబ్యూరో: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా బుధవారం పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం కార్యక్రమానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి గ్రూప్–4 లో ఉత్తీర్ణులైన 511 మంది అభ్యర్థులు తరలివెళ్లారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద వీరి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 11 బస్సులను జెండా ఊపి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారి సాంబశివరావు ప్రారంభించారు. అభ్యర్థుల భద్రత దృష్ట్యా ప్రతి బస్సుకు ఒక కానిస్టేబుల్, ఒక లైజన్ అధికారిని నియమించారు. బస్సుల్లో తరలివెళ్లిన అభ్యర్థులకు మధ్యాహ్న, రాత్రి భోజనాల వసతి కూడా కల్పించారు. అభ్యర్థులు బాధ్యతాయుతంగా, అంకితభావంతో పని చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా డీఆర్‌డీఏ సాంబశివరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామ్మోహన్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసిస్, డీటీఓ వెంకటేశ్వర్లు, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

గౌతంనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ అన్నారు. మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్ కాలనీలో రూ. 83 లక్షలతో నిర్మించి తలపెట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మల్కాజిగిరి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. జలమండలి మేనేజర్ నవీన్, సూపర్‌వైజర్ నాగార్జున, దుర్గాప్రసాద్, సంజీవ్, మధు, లక్ష్మీనారాయణ, రాముయాదవ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

అల్వాల్: అల్వాల్ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో రూ.52 లక్షలతో కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఏఈ అభిషేక్, రామారావు, నరేందర్‌రెడ్డి, ప్రేమ్, రవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన


మల్లాపూర్: రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రాచకొండ ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్ ఆదేశాల మేరకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ రాచకొండ ఆధ్వర్యంలో నాచారం వెస్లీ కో ఎడ్యుకేషన్ హైస్కూల్‌లో దాదాపు 500 మంది విద్యార్థులకు సైబర్ మోసాలు, మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, చైల్డ్ లేబర్, డ్రగ్స్, మైనర్ల బైక్‌రైడింగ్ వంటి విషయాలపై కూలకషంగా అవగాహన కల్పించారు. సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలకు గురైతే సైబర్‌క్రైమ్స్ డయల్ 1930, ఎమెన్ హెల్ప్‌లైన్ 1091/181, హెల్ప్‌లైన్ 1098/ 112ను సంప్రదించాలన్నారు. ఎస్సైలు వెంకట శ్రీను, రాములునాయక్, ఏఎస్సై వెంకటస్వామి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



అల్వాల్: కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మి గణపతి ఆలయం స్వామివారి వారోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి సుప్రభాతసేవ నిర్వహించి 32 ఔషదీకృత ద్రవ్యాలతో విశేష హోమాలు నిర్వహించామని ఆలయ వ్యవస్థాపకులు, కార్య నిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు. అన్న ప్రసాద ట్రస్టు ద్వారా నిత్యాన్నప్రసాదం ఉంటుందని భక్తుల నుంచి విరాళాలను ఆహ్వానిస్తున్నామన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



మల్లాపూర్: నాచారం బాబానగర్‌లోని అజ్రత్ సయ్యద్ మహ్మద్ షావలీ దర్గా ఫాతియా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీమంత్రి, ఎమ్మెల్సీ మహమూద్‌అలీ హాజరయ్యారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, గ్రేటర్ బీఆర్ఎస్ నేత సాయిజెన్‌శేఖర్, రాష్ట్ర మైనార్టీ నేత బద్రేద్దీన్, షేక్ అహ్మద్ ఖాద్రీ, షేక్‌గేలామ్‌షా, హుస్సేన్, అయ్యూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌షాప్ గొడవ కేసులో నిందితుడి అరెస్ట్

అల్వాల్: పాన్‌షాప్ వద్ద జరిగిన గొడవలో వ్యక్తి మృతి చెందిన కేసులో నిందితుడిని నేరేడ్‌మెట్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న వినాయక్‌నగర్ చౌరస్తాలోని పాన్‌షాప్ వద్ద పాన్ కొనుగోలు చేయడానికి బండారి రాము అనే వ్యక్తి వచ్చాడు. జవహర్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్ అతడితో గొడవ పడి రాము ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.